



మహబూబాబాద్ మార్కెట్‌కు వచ్చిన మిర్చి (ఫైల్), మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం



- కొత్త పాలకవర్గంపై చిగురిస్తున్న ఆశలు
- సెలక్షన్ గ్రేడ్‌గా అప్‌గ్రేడ్ అయ్యేనా..?
- బయటి కాంటలతో ఆదాయానికి గండి

మార్కెట్ రూపురేఖలు మారేనా ?

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌లలో కొత్తపాలక మండలి ఏర్పాటుతో వాటి రూపురేఖ లు మారుతాయని అన్నివర్గాలు భావిస్తున్నాయి. అయితే గత పాలకులు మార్కెట్లను పట్టించుకోక పోవడంతో సమస్యలన్నీ ఏళ్ల తరబడి అపరి ష్కృతంగా ఉన్నాయి. మహబూబాబాద్ మార్కెట్ విషయానికొస్తే రూ. కోట్లలో ఆదాయం వస్తున్నా.. గత పాలకులు, అధికారులు అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం చేశారు. ఈ మార్కెట్‌కు నూతన పాలకమండలి ఏర్పాటైంది. రేపోమాపో ప్రమాణస్వీకారం చేయనున్న తరుణంలో మార్కెట్ అభివృద్ధి జరుగుతుందని రైతులు, ప్రజలు ఈ పాలకమండలిపై ఆశలు పెంచుకున్నారు.

మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ కోసం కృషి...

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. 2016-17 నుంచి ఏటా రూ.3 కోట్లకు పైగానే ఆదాయం వస్తోంది. అయినప్పటికి మార్కెట్ అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. ఈ మార్కెట్ గ్రేడ్-1 స్థాయిలోనే ఉంది. నిజానికి మార్కెట్ బైలా ప్రకారం. మార్కెట్ వార్షిక ఆదాయం రూ.3 కోట్లకు పైగా ఉంటే మార్కెట్ల స్థాయిని అప్‌గ్రేడ్ చేస్తారు. అయితే మానుకోట మార్కెట్ ఈ మధ్య కాలంలో ఏటా రూ.7 కోట్ల వరకు ఆదాయం వస్తోంది అయినప్పటికి మార్కెట్ అధికారులు, ప్రభుత్వం కానీ స్పెషల్ గ్రేడ్ స్థాయికి, ఆపై సెలక్షన్ గ్రేడ్‌స్థాయికి పెంచాల్సి ఉండగా అలాంటిది ఇప్పటి వరకు మార్కెట్ అప్‌గ్రేడ్ చేసేందుకు అధికారులు ఊసెత్తడం లేదు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ విషయానికొస్తే మహబూబాబాద్ మార్కెట్ కంటే ఆదాయం తక్కువగా ఉన్నప్పటికి అధికారులు, అక్కడి పాలక మండలి ఆధునిక మార్కెట్‌గా తీర్చిదిద్దుతున్నారు.

మోడల్ మార్కెట్..

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ 1949లోనే తొమ్మిదిన్నర ఎకరాల్లో ఏర్పాటు జరిగింది. ఆ స్థలంలోనే ఆర్వోబీ నిర్మాణం, గోదాముల నిర్మాణాలు జరుగడంతో యార్డు స్థలం కుదించుకుపోయింది. సీజన్‌లో మిర్చి, పత్తి, ధాన్యం, అపరాలు వస్తే మార్కెట్ యార్డు సరిపోవడం లేదు. దాంతో గత పాలకమండలి సభ్యులు కొత్త మోడల్ మార్కెట్‌కు 30 ఎకరాల స్థలం కావాలని ప్రభుత్వానికి నివేదించారు. గత కొన్నేళ్ల క్రితం జిల్లా కలెక్టర్ మార్కెట్‌కు 27 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆ స్థలాన్ని మార్కెటింగ్ శాఖకు అప్పగించేందుకు ప్రయత్నించారు. ఆ స్థలంలో గుట్టలు, రాళ్లు, రప్పలు ఉండడంతో మార్కెట్ యార్డుకు కష్టతరంగా ఉం టుందని, అనుకూలంగా లేదని, వేరే స్థలం కావాలని అప్పటి మార్కెట్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఆ ప్రయత్నాలు ఇంకా ముందుకు సాగలేదు.

ఎలక్ట్రానిక్ తక్ పట్టీలేవీ?

మార్కెట్‌లో జరిగే క్రయవిక్రయాలు తక్‌పట్టీలు రావాల్సి ఉండగా, కొందరు వ్యాపారులు నూటికి నూరుశాతం తక్‌పట్టీలు పెట్టడం లేదని ఆరోపణలు వస్తున్నా యి. మార్కెట్‌యార్డులో ఎలక్ట్రానిక్ తక్‌పట్టీలు రైతులకు ఇచ్చే పద్ధతి లేకపోవడం వల్ల వ్యాపారులే మాన్యువల్ పద్ధతిలో తాముకొన్న సరుకుకు తక్‌పట్టీలు పెడుతున్నారు. అయితే వ్యాపారులు కొంత సరుకుకుపెట్టి, మరికొంత సరుకుకు తక్‌పట్టీలు పెట్టడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మార్కెట్‌లో జరిగిన క్రయ విక్రయాలకు రైతులకు ఆన్ లైన్‌లో వెంటనే నగదు చెల్లించాల్సి ఉండగా రైతులకు నగదు ఇస్తే ఒకశాతం కమిషన్ కట్ చేస్తుండగా.. ఒకరి ద్దరు మాత్రం ఎక్కువగా కమిషన్ కట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. రైతుల ఖాతాలో నేరుగా జమచేస్తే ఎలాంటి కమీషన్ తీసుకోవడం లేదు. మార్కెట్ యార్డులో సరుకులు నింపే సమయంలో కొంతమంది కూలీలు సరుకు అడుగురాశులు బల వంతంగా తీసుకుంటుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మార్కెట్ సమీపంలో తాగునీటి సౌకర్యం మాత్రమే ఉంది. యార్డులోని షెడ్లలో తాగునీటి సౌక ర్యం లేకపోవడంతో మంచి తాగేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.5లకు అందించే భోజన సౌకర్యం లేకపోవడంతో మార్కెట్ యార్డుకు వచ్చే రైతులు ఆర్థకలితో ఆలమటిస్తున్నారు.

బయటి కాంటాలతో పరేషాన్..

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో, పట్టణంలో బయటి కాంటాల్లో చిల్లర కాంటాలు అధి కంగా ఉన్నాయి. దానికితోడు ఆయా ట్రేడింగ్ కంపెనీల ముందు కూడా కొంతమంది వ్యాపారులు సైతం మిర్చి, పత్తి, ధాన్యం, అపరాలను భారీగా కొనుగోళ్లు చేస్తున్నారు. అయితే కొంతమంది మాత్రం నిజాయితీగా రాస్తామల్ రూపంలో మార్కె ట్‌కు కొనుగోలు వివరాలు ఇచ్చి మార్కెట్ ఫీజు కడుతుండగా... మరికొంతమంది మాత్రం మార్కెట్ ఫీజు కట్టకుండా పోతుండ డంతో జీరోదందాకు ఆస్కారం ఏర్పడు తుంది. మార్కెట్ అధి కారులు వ్యాపారుల కంపెనీలపై, చిల్లర కాంటాలపై దాడులు చేయడం కరువైపోయింది. దాంతో మార్కెట్‌కు వచ్చే ఆదా యం కోల్పోతోంది. అలాగే మార్కెట్ యార్డులో ఉన్న షట్టర్లను లైసెన్స్ కలిగిన వ్యాపారులకు ట్రేడింగ్ కంపెనీ పెట్టుకునేందు కు కిరాయికి ఇవ్వాల్సి ఉండేది. అందుకు గాను టెండర్లను పిలి చి అద్దెకు ఇవ్వాలి. టెండర్లును గత పదేళ్ల నుంచి నిర్వహించకుం డా నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో ఉన్న వారికి ఆ షట్టర్లను అప్పగిస్తుండడంతో నామమాత్రపు కిరాయిలతో మార్కెట్‌కు చెల్లించి, బయటి వ్యక్తులకు వేల రూపాయాలకు కిరాయిలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నప్పటికి మార్కెట్ అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నా రు. దీంతో మార్కెట్ ఆదాయం కోల్పోతోంది.

శిథిలావస్థకు చేరిన మార్కెట్ కార్యాలయం..

మార్కెట్ కార్యాలయాన్ని 1977లో ని ర్మించడంతో అతి పురాతన కార్యాలయం కావడంతో పూర్తిగా శిథిలమై ఉండడం తో కూలిపోయే స్థితిలో ఉంది. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆ కా ర్యాలయాన్ని ఖాళీ చేసి పక్కనే ఖాళీగా ఉన్న డీఎంవో పాత భవనంలోకి మా ర్చారు. మార్కెట్ యార్డులో షెడ్ల నిర్మా ణం చేపట్టాలని, కంప్యూటర్ తక్‌పట్టీల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా, కేసముద్రం, తొ ర్రూరు మార్కెట్ పాలక మండలిలు కూడ కొలువుదీరాయి. కేసముద్రం మా ర్కెట్ స్పెషల్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ కు పెంచాల్సిన అవసరం ఉంది. ఈ మార్కెట్ మోడల్ మార్కెట్ చేసేందుకు మరో చోట స్థలం పరిశీలించిప్పటికి ప్ర యత్నాలు ఫలించలేదు. తొర్రూరు మా ర్కెట్‌ను కూడ అభివృద్ధి చేసేందుకు గ్రేడ్ స్థాయిని పెంచి మార్కెట్‌లోనే క్ర యవిక్రయాలు జరిగేందుకు కొత్త పాల కమండలి కృషి చేయాలి. అందుకు గా ను సిబ్బందిని పెంచి ఆ దిశలో ప్రయ త్నాలు కొనసాగించి మార్కెట్‌ను అభివృ ద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


గూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

గూడూరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబం ధనల ప్రకారమే రైతుల నుంచి ధాన్యం సేకరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సిం గ్ సూచించారు. అయోధ్యపురం, పొనుగోడు, గూడూరులో ఏర్పాటు చేసిన వద్ద కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన రిజిస్టర్లను పరిశీలించారు. తేమశాతం, రైతులు ఎదుర్కొం టున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓపీఎం ఎస్ ఆన్‌లైన్ విధానం ద్వారా రైతుల వివరాలను నమోదు చేసి, ధాన్యం కొను గోలు సంబంధించిన డబ్బులు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొను గోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని, రవాణా చేసే సమయంలో ఎలాం టి ఇబ్బందులు తలెత్తకుండ చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు, నిర్వాహకులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్వేత, వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ మాలిక్, ఏపీఎం రవీందర్, ఆర్ఐ మల్లయ్య, ఏఈవోలు పాల్గొన్నారు.

- కేసముద్రం : ఉప్పరపల్లి, కేసముద్రం విలేజి, కల్వలలో సొసైటీల ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం రాశుల వద్దకు వెళ్లి రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. తేమశాతం ఎంత వస్తోంది? ధాన్యం నూర్పిడీ చేయించి, ధాన్యం పరిమాణం కొలిచే యంత్రాల ద్వారా దొడ్డు, సన్నరకాలను గుర్తించే విధా నాన్ని పరిశీలించారు. రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించి త్వరితగతిన ధాన్యం ఎంపిక, తూకాలు, రవాణా చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఇన్ చార్జ్ తహసీల్దార్ ఎర్రయ్య, ఏవో బి.వెంకన్న, సొసైటీ సీఈవోలు గోపాల మల్లా రెడ్డి, ఎస్.వెంకటాచలం, ఏఈవోలు ఉన్నారు.

డీఈవోగా బాధ్యతలు చేపట్టిన రవీందర్‌రెడ్డి


డీఈవోగా బాధ్యతలు చేపట్టిన రవీందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యాలయ ఉద్యోగులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశా ఖాధికారిగా రవీందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన రాజేశ్వర్‌కు డీఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో నిర్మల్ జిల్లా విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించిన రవీందర్‌రెడ్డిని మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ ఈనెల 4న రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నరసింహరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రవీందర్‌రెడ్డి జిల్లా విద్యాశా ఖాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. డీఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆయనను జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

- లగచర్ల ఘటనను ఎండగడుతూ.. మానుకోటలో నేడు కేటీఆర్ ఆధ్వర్యంలో ధర్నా
- బీఆర్ఎస్ మాజీమంత్రి సత్యవతిరాథోడ్

మహబూబాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : లగచర్ల గిరిజన రైతు లకు న్యాయం జరిగేంత వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రా ష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తి గా వైఫల్యం చెందిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెం టీల వైఫల్యాలు, లగచర్ల ఘటనలో గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని ఎండగడుతూ గురువారం మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. లగచర్ల ఘట నకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌ను ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం సరికాద న్నారు. హుందాగా ఉండాల్సిన ముఖ్య మంత్రి వీధిరౌడీలా వ్యవహరిస్తు న్నారని ఆరోపించారు. కేటీఆర్, హరీష్‌రావును బిల్లా, రంగా అని మాట్లాడ తున్నారని, రేవంత్‌రెడ్డినే బిల్ల, రంగా అని చెప్పారు. లగచర్లలో గిరిజను లకు వారసత్వంగా వచ్చిన భూములను ఫార్మా కంపెనీల పేరుతో లా క్కుంటున్నారని, అడ్డుకుంటున్న గిరిజన రైతులను అన్యాయంగా అరెస్టు చేశారని, తక్షణమే వారిని విడుదల చేయాలన్నారు. గిరిజనులు ఓట్లువేసి అధికారంలోకి తీసుకువస్తే న్యాయం చేసేది ఇలానేనా అని ప్రశ్నించారు. మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించే ధర్నాకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ధర్నాను జయప్రదం చేయండి : ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ నేతృత్వంలో నేడు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఎమ్మె ల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పిలుపునిచ్చారు. లగచర్లలో రైతుల భూము లను అన్యాయంగా లాక్కుని వారిపై కేసులు పెడుతున్న కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి లగచర్ల ఘటన విషయంలో బీఆ ర్ఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వివరించారు. మాజీఎంపీ,

మిగతా 8లో..


ఎస్పీ క్యాంప్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి, మాజీ ఎంపీ కవిత

కేటీఆర్ ధర్నాకు అనుమతి నిరాకరణ

- ఎస్పీ క్యాంప్ ఆఫీస్ ఎదుట బీఆర్ఎస్ నేతల ఆందోళన

లగచర్ల ఘటనను ఎండగడుతూ మానుకోటలో గురువారం బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించ తలపెట్టిన ధర్నాకు పోలీ సులు అనుమతి నిరాకరించడంతో ఎస్పీ క్యాంప్ ఆఫీస్ ఎదుట బుధవా రం రాత్రి ఆ పార్టీ నేతలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ లగచర్లలో గిరిజన రైతుల భూములను లాక్కోవడంతో పాటు వారిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. వారికి మద్దతుగా మహబూబాబాద్‌లో ధర్నా నిర్వహించతలపెట్టగా, ధర్నాకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడం పిరికిపంద చర్య అన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే పోలీసులు అనుమతి ఇవ్వలేదన్నారు. ధర్నా కు అనుమతి ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. ఆందో ళన చేస్తున్న బీఆర్ఎస్ నేతలు ఎస్పీ క్యాంపు ఆఫీసులోకి వాటర్‌బాటిళ్ల ను విసిరి వేశారు. ఈ క్రమంలో అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా, మానుకోటలో నేడు 144 సెక్షన్‌ను పోలీసులు విధించారు. ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీలు శ్రీని వాస్‌రెడ్డి, రవీందర్‌రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నా యక్, మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ వెంకన్న, మాజీ జడ్పీచైర్‌పర్సన్ ఆంగోతు బిందు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

లగచర్ల ఘటనకు సూత్రధారి కేటీఆర్

- మానుకోట పట్టణానికి ఏ ముఖం పెట్టుకుని వస్తున్నావ్
- భూములు కోల్పోయిన గిరిజన రైతులకు ఏం న్యాయం చేశారు?
- ఆంధ్రా పాలకులకు రాళ్లతో బుద్ధి చెప్పిన చరిత్ర మరవకండి
- ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాటోతు రాంచందర్‌నాయక్

మహబూబాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొడంగల్ నియోజక వర్గం లగచర్ల వద్ద ఇండస్ట్రీయల్ కారిడార్ కోసం భూసేకరణకు అధికారులు రైతుల వద్దకు వెళ్తే.. వారిపై బీఆర్ఎస్ నేతలు దాడి చేసింది వాస్తవం కాదా.! లగచర్ల ఘటనకు సూత్రదారి మాజీమంత్రి కేటీఆర్ అని ప్రభుత్వవిప్, డోర్న కల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ ఆరోపించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ మం త్రి కేటీఆర్ మానుకోటకు ఏం చేశారని ఇక్కడికి ఏ ముఖం పెట్టుకుని వస్తు న్నారని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిప డ్డారు. మానుకోటలో మెడికల్ కళాశాల కోసం గిరిజన రైతుల భూములను లాక్కొని పరిహారం ఇవ్వకుండా మహిళ గిరిజన రైతులనుజైలుకు పంపిం చింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని నిలదీశారు. ఫాంహౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్ వ్యూహాలు రచిస్తుంటే కేటీఆర్, హరీష్‌రావు వీధుల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్రా పాలకులను రాళ్లతో తరిమిన చరిత్ర మానుకోటదని, ఇది మరువద్ద న్నారు. మానుకోటలో కేటీఆర్ ధర్నాను తిప్పి కొట్టాలన్నారు. లగచర్ల అం శాన్ని మసిపూసి మారేడు కాయ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నంచేస్తోందని, ఈ రేస్ కుంభకోణంలో కేటీఆర్‌కు ఉచ్చు బిగుస్తోందని.. ఆయన జైలుకు వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. గుంట భూమిలేని సురేష్ అనేవ్యక్తి ఈ దాడిలో ఎలా ఉన్నారని ప్రశ్నించారు. కేటీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పేరోజులు దగ్గరపడ్డాయన్నారు. గతంలో గిరిజన రైతులకు అన్యాయం జరిగిన సమ యంలో మాజీమంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ కవిత, బీఆర్ఎస్ నాయ కులు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. సమస్య కొడంగల్ అయితే మానుకో టలో వచ్చి ధర్నా ఎందుకు చేస్తుండో..చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక్కడి గిరిజన రైతులకు సమాధానం చెప్పాకనే మాజీమంత్రి కేటీఆర్ మహబూ బాబాద్ పట్టణానికి రావాలన్నారు.

గిరిజన ద్రోహి కేటీఆర్ : ఎంపీ బలరాంనాయక్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మహబూ బాబాద్‌లో గిరిజన భూములను లాక్కునప్పు డు మాట్లాడని మాజీ మంత్రి కేటీఆర్ ఇప్పుడు మానుకోటలో సభ పెట్టడం సిగ్గుచేటని, గిరి జన ద్రోహి కేటీఆర్ అని మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. గిరిజన రైతు లకు న్యాయం చేయని ఆయనకు మానుకో టలో ధర్నా చేసే నైతిక హక్కు లేదని ఖమ్మం లో మిర్చి రైతులను జైలుకు పంపించిన ఘన త బీఆర్ఎస్‌దని అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్ ప్రేరణతోనే లగచర్లలో అధికారులపై దాడి జరిగిందని ఆరోపించారు. గిరిజనుల పక్షాన పోరాడిన వార్డు కౌన్సిలర్‌ను పొట్టన పెట్టుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని, గిరిజ నుల గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. మానుకోటకు కేటీఆర్ వస్తే ఈ ప్రాంత ప్రజలు తరిమికొట్టడం ఖాయమన్నా రు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అర్బన్ అధ్య క్షులు ఘనపురపు అంజయ్య, కేసముద్రం మా ర్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, అంబటి వీర భద్రం, గునిగంటి కమలాకర్, నీరుటి లక్ష్మీనారా యణ, యాదవరెడ్డి, ఖలీల్‌పాషా, ఎడ్ల రమేష్, హరిసింగ్, బోడ రవినాయక్, గుగులోతు వెం కట్, శంతన్ రామరాజు, భూక్య లక్ష్మి, విజయ లక్ష్మి పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంపై మాట్లాడే హక్కు రేవంత్‌రెడ్డికి లేదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు


మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న యలమంచిలి వెంకటేశ్వరరావు

మహబూబాబాద్ రూరల్, నవం బరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడే అర్హత సీఎంరేవంత్‌రెడ్డికి లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర రావు అన్నారు. మహబూబాబాద్‌లోని పార్టీ కార్యాయంలో బుధవారం ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్‌రెడ్డి ఎక్కడున్నా డో? ఏ నాడైనా జైతెలంగాణ అని నిన దించారా! అని ప్రశ్నించారు. తెలం గాణ సాధన కోసం పోరుయాత్ర చే సింది, పార్లమెంటులో బిల్లుపాస్ కా వాలని నిరాహార దీక్ష చేసింది కిషన్‌రె డ్డి అని పేర్కొన్నారు.తెలంగాణ కోసం ఉద్యమాలు చేస్తే, నువ్వు సమైక్యాంధ్ర కోసం సహకరించిన విషయం మరిచి పోయావా అని ఆరోపించారు. జేఏ సీలో భాగంగా ఉద్యమాల్లో చురుకు గా పాల్గొన్నది కిషన్‌రెడ్డి అని, నీతిని జాయితీ, నైతిక విలువలకు పెద్దపీట వేసే ఆయన గురించి.. మాట్లాడే నైతి క హక్కు రేవంత్‌రెడ్డికి లేదని ఆరో పించారు. తెలంగాణ ప్రజల ఉద్యమ ఆకాంక్షకు తలొగ్గి గత్యంతరంలేక ప్ర త్యేక రాష్ట్రం సోనియాగాంధీ ఇచ్చింద ని పేర్కొన్నారు. సోనియాగాంధీ కాళ్ల కడగాల్సిన అవసరం కిషన్‌రెడ్డికి లేద ని, నీవు ఆమె కాళ్లకడిగి నెత్తినపోసు కుంటే మాకు అభ్యంతరంలేదన్నారు. ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఆశిం చకుండా కేవలం ప్రజల కోసమే భేష రతుగా తెలంగాణ బిల్లుకు మద్దతి చ్చిన పార్టీ బీజేపీ అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మోసంగి ముర ళీ, ధర్మారపు వెంకన్న, మాధవపెద్ది శ శివర్ధన్‌రెడ్డి, దార బిందుభారతి, భాను శ్రీనునాయక్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ అన్నారు. బుధవారం మహబూ బాబాద్‌లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ప్రసంగించారు. లక్ష్యాన్ని ఎంచుకొని క్రమశిక్షణ, పట్టుదలతో గ్రంథాలయంలో ఉన్న వివిధ పోటీ పరీక్షల పుస్తకాలను చదివి ఉద్యోగం సాధించవచ్చన్నారు. నేటి యువత పుస్తక పఠనంపై ఆస క్తిని పెంపొందించుకోవాలని, మనిషి సామాజిక ఎదుగుద లకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకొని సమాజా భివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం విశ్రాంత గ్రంథా లయ అధికారి గండ్రకోటి లక్ష్మణ్, గూర నరేందర్, పోచారపు ఉప్పలయ్యను సన్మానించారు. గత వారం రోజులుగా నిర్వ హించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్ర మంలో టీవీ రామనర్సయ్య, విజేందర్, రవి, రుద్రారపు విరేందర్, భూలక్ష్మీ, భాస్కర్, అభిషేక్, శంకర్, గౌస్, నరేష్, శ్రీకాంత్, ఉపేందర్, జానకి, సూరజ్, విజ్ఞాన్, హిమబిందు, ప్రభాకర్, వినయ్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల బుధవారం ముగింపు రోజున గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్.రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిం చారు. అనంతరం పుస్తక ప్రదర్శన చేపట్టారు. ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు అనిల్‌కుమార్, శ్రీనివాస్, సాంబశివరావు, మసూద్‌అహ్మద్, అన్నపూర్ణ, వినోద్‌కుమార్, హతిరామ్, ఖాసీంషా, సుమన్, సందీప్, వీరు, సుమలత, ప్రభావతి, ఉపేందర్, నాగరాజు, ఉదయ్‌కుమార్, పూజిత, నరేష్, రామన్న పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న లెనిన్‌వత్సల్ టొప్పొ

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కేసులే
- జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల

8

మానుకోటను రోల్ మోడల్‌గా నిలుపుతాం
- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నర్మద బాయి

రాష్ట్రస్థాయి క్రీడలకు గురుకుల బాలికలు

ములుగు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన కాళేశ్వరం 10వ జోనల్‌స్థాయి క్రీడల్లో ములుగులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్మదబాయి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వివిధ క్రీడల్లో 8 స్వర్ణపతకాలు, రెండు రజత పతకాలు, రెండు కాంస్య పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించు కున్నారని అన్నారు. 19 సంవత్సరాల విభాగం కబడ్డీ పోటీల్లో రన్నరప్, చెస్‌లో స్వర్ణం, 14 సంవత్సరాల విభాగం టెన్నికాయిట్‌లో రన్నరప్‌గా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, పీడీ త్రివేణి, పీఈటీ శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామప్పలో ఈ వృక్షాలు ఎందుకు ?

- ఆలయ ప్రాంగణంలోని ఏడాకుల చెట్లు
- విష వాయువును విడుదల చేస్తాయంటున్న శాస్త్రవేత్తలు
- తొలగించాలని పర్యాటకుల డిమాండ్

వెంకటాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం ప్రధాన గేట్ నుంచి ఆలయం వరకు రెండువైపులా ఏడాకుల చెట్లు విస్తరించి ఉన్నాయి. వీటి నుంచి వచ్చే గాలి పీల్చుకోవడం వల్ల అనారోగ్యం కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్తమా రోగులకు ఇవి మంచిదికాదని శాస్త్రీయంగా నిరూపితమైనట్లు తెలుస్తోంది. ఈ చెట్టు భారతదేశంలో చాలా చోట్ల కనిపిస్తున్నట్లు వృక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎడిన్‌బర్గ్‌కు చెందిన ప్రముఖ వృక్ష శాస్త్రజ్ఞుడు అల్స్టాన్ జ్ఞాపకార్థం ఈ వృక్షానికి అల్‌స్టోనియా స్కోలరీస్ శాస్త్రీయనామం పెట్టినట్లు తెలుస్తోంది. ఈ చెట్లతో ఎలాంటి ఉపయోగం కూడా లేనట్లు సమాచారం. పిల్లలకు అవసరమయ్యే చెక్క పలకలను తయారు చేసేందుకు ఈ చెట్టు కలపను ఉపయోగిస్తారని తెలుస్తోంది. ఆంగ్ల భాషలో డెవిల్ ట్రీగా పిలువబడే దెయ్యం వృక్షంగా పేరు వచ్చింది. భారతదేశంలో దెయ్యం వృక్షంగా ప్రాచుర్యం పొందింది. అక్టోబరులో ఈ చెట్టు సువాసన కలిగిన పుష్పాలను కూడా అందిస్తుంది. కానీ, ఈ చెట్టు అన్ని భాగాలూ విషపూరితమైనవిగా శాస్త్రవేత్తలు అంటున్నారు. పశ్చిమ కనుమల్లోని గిరిజన ప్రజలు ఈ చెట్టు నీడలో కూర్చునేందుకు అయిష్టత వ్యక్తం చేస్తారని తెలుస్తోంది. రామప్ప ప్రధాన ఆలయంలో ఉన్న ఇలాంటి చెట్లను తొలగించాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.



రామప్ప ప్రధాన గేట్ నుంచి దేవాలయం వరకు ఉన్న ఏడాకుల చెట్లు

దళారుల చేతిలో నష్టపోవద్దు

- మద్దతు ధర చెల్లించేందుకే కొనుగోలు కేంద్రాలు
- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాంచంద్రునాయక్

నర్సింహులపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా ఉండేందుకే రాష్ట్రప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. వడ్ల కొనుగోలు సెంటర్లలో ఉత్పత్తులను విక్రయించి, మద్దతు ధర పొందాలని కోరారు. వంతడుపల స్టేజీ, ముంగిమడుగు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్య దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మ్యాచర్ 17 శాతంలోపు ఉన్న సన్నరకం వడ్ల మద్దతు ధర క్వింటాకు రూ. 2320తో పాటు రూ.500 బోనస్ రైతుల ఖాతాలో జమ చేస్తారన్నారు. కంపసాగర్, సిద్ధి, వరంగల్ సన్నాలు, జగిత్యాల్, రాజేంద్రనగర్, కృష్ణ, తెలంగాణ సోనాతో పాటు 33 రకాల సన్నధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల్లో భాగంగానే ధాన్యానికి ధరతో పాటు బోనస్ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మేరుగు సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, తహసీల్దార్ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్రి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరోజు రాజశేఖర్, గ్రామీణ వైద్యుల మండల అధ్యక్షుడు గుగులోత్ రాజేందర్, యువజన నాయకులు చిర్ర సతీష్, మానవ హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్ రవీందర్, యాకన్న, బిచ్చు, వెంకన్న, శంకర్, ఉదయ్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.



మల్యాల పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో మురళీధర్

మెరుగైన వైద్య సేవలందించాలి

మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి మురళీధర్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌వో మురళీధర్ అన్నారు. మహబూబాబాద్ మండలం మల్యాల పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలన్నారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు ట్యాగ్ పెనిలిటీస్‌కి పంపించాలని, 102 వాహనాన్ని వినియోగించుకోవాలని, వ్యాధి నిరోధక టీకాలు పుట్టిన దగ్గర నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ వంద శాతం వేయాలన్నారు. గర్భిణుల నమోదు 12 వారాల్లో చేయాలన్నారు. రెండు వారాలు మించి దగ్గు ఉంటే తెమడ పరీక్ష చేయించాలని, క్షయ వ్యాధిని త్వరగా గుర్తించి ఆరు నెలల వరకు మందులు వాడితే నయమవుతుందన్నారు. ఈ తనిఖీల్లో డీపీహెచ్‌ఎన్‌వో మంగమ్మ పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన మహబూబాబాద్ శివారు బోరింగ్‌తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలుకు చెందిన మంద సంధ్య (35) పని నిమిత్తం మహబూబాబాద్ మండలం అమనగల్ గ్రామానికి ఈనెల 18న మరో మహిళతో కలిసి వచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు ఓ ద్విచక్ర వాహనదారుడిని ఆశ్రయించారు.

సంధ్యతో పాటు మరో మహిళను బైక్‌పై మహబూబాబాద్‌కు తీసుకువస్తుండగా బోరింగ్‌తండా సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి ఆమె కింద పడింది. ఈ ఘటనలో సంధ్య తలకు తీవ్రగాయాలు కాగా, 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సంధ్య బుధవారం ఉదయం మృతి చెందారు. మృతురాలికి భర్త మల్లికార్జున్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి క్రెడాయి కృతజ్ఞతలు

బాలసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహానగర అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి క్రెడాయి వరంగల్ చాప్టర్ అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వరంగల్ మాస్టర్ ప్లాన్ - 2041కు ఆమోదముద్ర వేయటంపై సంతోషం వ్యక్తం చేశారు. మామునూర్ ఎయిర్‌పోర్టు పునరుద్ధరణకు రూ. 205 కోట్లు, ట్రైసిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.4170 కోట్లు, వరంగల్ ఆర్టీవో ఆఫీసు జంక్షన్ నుంచి గొర్రెకుంట, ఏనుమాముల మీదుగా 163 జాతీయ రహదారిని కలిపే పైడిపల్లి(ఆరెపల్లి) వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

కాళోజీ కళాక్షేత్రా న్ని ప్రారంభించి జాతికి అంకితం చేసి, నయీంనగర్ వంతెనను ప్రారంభించి అనేక అభివృద్ధి పనులకు నిధుల కేటాయించి త్రినగరి అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఉపాధ్య క్షులు అమరేందర్‌రెడ్డి, శాఖమూరి అమర్, ఎంరవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జె. మనోహర్, సంయుక్త కార్యదర్శులు ఎల్ రజినీకాంత్‌రెడ్డి, ఎం. రాజ్‌కుమార్, జి. రాజేందర్‌రెడ్డి, కోశాధికారి ఎ.వెంకటమల్లారెడ్డి ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్ రాజు

తొర్రూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు కోర్టు జడ్జి మట్ట సరిత న్యాయవాదులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బుధవారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ప్రవీణ్ రాజు మాట్లాడుతూ జడ్జి మట్ట సరితను వెంటనే తొర్రూరు కోర్టు నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా హైకోర్టు స్పందించి వెంటనే జడ్జి సరితను విధుల నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మనపురం రామకృష్ణ, న్యాయవాదులు యాకాంబ్రం, బొల్లం వెంకటేష్, భాస్కర్, గంపల ప్రవీణ్, శ్రీశైలం, కృపావతి, పల్లవి, తదితరులు ఉన్నారు.

విద్యా సంస్థల పరిశీలన

కేసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసముద్రం విలేజి శ్రీ వివేకవర్ధిని, ధన్నసరి సెయింట్ జాన్స్, కల్వల మోడల్ స్కూళ్లను బుధవారం జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ ఆజాద్ చంద్రశేఖర్, ఎంఈవో కాలేరు యాదగిరి పరిశీలించారు. పాఠశాలల్లో విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే మాక్ టెస్ట్ 1, 2 ఫలితాలను పరిశీలించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సూచనలు చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రూ.77 వేల బంగారు గొలుసు స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం జనగామ పోలీస్ స్టేషన్‌లో నిందితుని అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఏసీపీ పార్థసారథి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా, బక్కురుప్పుల తండాకు చెందిన కేలోత్ సాయికృష్ణ అక్టోబరు 14న ఇంటి నుంచి బయల్దేరి ఏదైనా పని చేద్దామని జనగామకు వచ్చాడు. జాబ్ దొరకక పోవడంతో బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈనెల 4న గతంలో తాను డిగ్రీ పూర్తి చేసిన ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పీజీ అడ్మిషన్ కోసం వెళ్లాడు. అక్కడి లైబ్రేరియన్ భూక్య ఉపేందర్ వికలాంగుడని గమనించాడు. ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో దొంగతనం చేయాలని అనుకున్నాడు. మరుసటి రోజు ఉదయం లైబ్రేరియన్ కంటే ముందే కళాశాలకు చేరుకుని లైబ్రరీ వద్ద వేచి ఉన్నాడు.

కొద్దిసేపటికి లైబ్రేరియన్ వచ్చి లైబ్రరీలో కిటికీలు తీద్దామని వెళ్తుండగా సాయికృష్ణ లైబ్రేరియన్‌ను వెనుక నుంచి కింద పడేసి మెడలో ఉన్న బంగారు చైన్ లాక్కొని పారిపోయాడు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. డీసీపీ సూచనల మేరకు ఏసీపీ పార్థసారథి పర్యవేక్షణలో సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్‌ఐ భరత్ దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో పక్కా సమాచారం మేరకు బుధవారం ఉదయం స్థానిక విజయ లాడ్జిపై ఉన్న ఎస్సీ హాస్టల్‌లో నిందితున్ని పట్టుకొని విచారణ చేయగ నేరాన్ని ఒప్పుకున్నాడు. అతని నుంచి రూ.77వేల విలువ గల 10 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్
- రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



నిరాహార దీక్షలో పాల్గొన్న వీహెచ్‌పీఎస్ నాయకులు

జనగామ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. చేయూత పించన్ల పెంపు, దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో బుధవారం జనగామలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన రిలే నిరసన నిరాహార దీక్షలను ఉపేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పింఛన్లు ఇవ్వకుండా రూ.6 వేల పింఛన్ల పెంపుతో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను నెరవేర్చకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వికలాంగులకు అన్యాయం చేస్తుందన్నారు. వికలాంగుల మీద చిత్తశుద్ధి ఉంటే వికలాంగ మంత్రిత్వ శాఖను తక్షణమే ఏర్పాటు చేసి వారి సంక్షేమంపై దృష్టి పెట్టాలన్నారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ దివ్యాంగ సమాజంపై, చేయూత పింఛన్‌దారులపై చిన్నచూపు చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పెన్షన్ల పెంపు, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23 వరకు కలెక్టరేట్ కేంద్రంగా వీహెచ్‌పీఎస్ నిరసన దీక్షలు చేపడుతుందని, స్పందించని పక్షంలో 26న చలో హైదరాబాద్ వికలాంగుల విజృంభన మహాసభను నిర్వహిస్తామని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కి ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం సోమరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిర్రు నగేష్, ఎంఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి, పైసా రాజశేఖర్, ఇనుముల నర్సయ్య, సందెన రవీందర్, ముక్కెర ముఖేష్, గువ్వల రవి, బొట్ల మహేష్, గంధమల్ల ఉదయ్, అరుణ్, కట్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

- నేడు హనుమకొండ కలెక్టరేట్‌కు

డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాక

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్‌కు గురువారం డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావు వస్తున్నారని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషా పేర్కొనే విషయంపై బహిరంగ విచారణకు కమిషన్ వస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లోని బీసీ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాల నాయకులు బహిరంగ విచారణకు హాజరై రిజర్వేషన్ల ధామాషాపై అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలు కమిషన్‌కు తెలియజేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కొడకండ్ల ఏఎంసీ కమిటీ ప్రమాణం



ప్రమాణ స్వీకారం చేస్తున్న వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం

కొడకండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సెల్ చైర్మన్ ప్రీతమ్ కుమార్ సమక్షంలో చైర్‌పర్సన్‌గా దేవరుప్పులకు చెందిన నల్లా అండాలు, వైస్ చైర్మన్‌గా ఏడునూతుల గ్రామానికి చెందిన సాయికృష్ణ, డైరెక్టర్లుగా దేశగాని నాగరాజు, వలభోజు రమేష్, బత్తుల వెంకన్న, వనం మోహన్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులతో సమన్వయంతో ముందుకు సాగి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించి వారికి అభివృద్ధికి కృషి చేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులను రాజుగా చేసేందుకు అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతు పక్షపాతిగా నిలిచారన్నారు. అంతకుముందు యశస్వినిరెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు బోనాలు, డప్పుచప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్.లక్ష్మీనారాయణ డి.సురేష్‌నాయక్, డి.రాజేష్‌నాయక్, నల్లా శ్రీరాములు, అందె యాకయ్య, పసునూరి మధుసూదన్, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గొర్రెల కాపరి, జీవాల మృతి



నర్సయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ రైల్వే గేటు వద్ద సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట వైపు వెళ్తున్న ఓ రైలు రైల్వే గేటు దాటుతున్న 10 జీవాలను, కాపరి దేవసాని నర్సయ్య(58) అనే వ్యక్తిని ఢీకొట్టడంతో జీవాలు, కాపరి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు, జీఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామానికి చెందిన పెరబోయిన రాజు, పులిగిల సోమయ్య వివాహ వేడుకకు వెళ్లాల్సి ఉంది. వారి జీవాలను కాయడానికి బుధవారం నర్సయ్యకు అప్పగించారు. నర్సయ్య జీవాలను మేపడానికి కుర్చపల్లి నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని రాఘవపూర్ రైల్వే గేటు దాటివచ్చి మేపాల్సి ఉండగా వాటిని తోలుకొని గేట్ వద్దకు చేరుకున్నాడు. అప్పటికే రైలు వస్తుందని గేటు మూసివేశారు. జీవాలు పరుగెత్తుకొని వచ్చి గేటు కింది నుంచి దాటాయి. జీవాలతో పాటు నర్సయ్య గేటు దాటివచ్చాడు. కొన్ని జీవాలు గేటు దాటలేదు. వాటిని దాటించడానికి నర్సయ్య వెనక్కి వెళ్లాడు. అప్పటికే గేటు దాటిన జీవాలు ఒక్కసారిగా తిరిగి వెనక్కి వచ్చాయి. అప్పటికే రైలు సమీపించడంతో నర్సయ్యను, జీవాలను రైలు ఢీకొట్టింది. నర్సయ్య విద్యుత్ స్తంభానికి బలంగా తగిలి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో 10 జీవాలు మృతి చెందాయి. జీవాలను కాపాడబోయి నర్సయ్య మృతి చెందిన సంఘటనతో కుర్చపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఆర్పీఎఫ్ ఎస్సై రాజన్న, జీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, పీసీ నరేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య కోమల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన బ్లూకోర్ట్స్ సిబ్బంది


మహబూబాబాద్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ సెంటర్ సమీపంలోని ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఇందిరాగాంధీ సెంటర్ సమీపంలోని తల్లాడ స్పందన మెడికల్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 2014లో ఆమె భర్త రమేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమెకు, రమేష్ అన్న (వరుసకు బావ)కు మధ్య భూవివాదం జరుగుతోంది. దీంతో మనస్తాపం చెందిన స్పందన బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. ఇది గమనించిన పక్కింటి వారు డయల్ 100కు కాల్ చేయడంతో బ్లూకోర్ట్స్ సిబ్బంది రాంబాబు, రవి ఘటన స్థలానికి చేరుకుని ఉరివేసుకున్న స్పందనను కిందకు దించి సీపీఆర్ చేసి ఆమె ప్రాణాలను కాపాడారు. అనంతరం చికిత్స నిమిత్తం జిల్లా అస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఆమె ఐసీయూలో చికిత్స పొందుతున్న బ్లూకోర్ట్స్ సిబ్బంది రాంబాబు, రవి తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2440	2080
పల్లికాయ (సూక)	5460	4000
పల్లికాయ (పచ్చిది)	3500	3000
కందులు	-	-
పెసళ్లు	6223	5250
పత్తి	6810	5800
కొత్తపతి	-	-
పసుపు (కాడి)	11529	11000
పసుపు (గోల)	11011	10950
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	15000	14000
వండర్‌హాట్ ఏసీ	13500	11000
యూఎస్341ఏసీ	14500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం



చెట్ల పొదల మధ్య కూరుకుపోయిన చౌడేశ్వరాలయం



శిథిలమై నేలమట్టమైన 500 స్తంభాల ఆలయం



భోగేశ్వరాలయంలోని శివాలయం, నంది విగ్రహం

నాటి సైనిక స్థావరం.. నేడు శిథిలం

- పలు ప్రాచీన ఆలయాలకు నిలయం కొండపర్తి
- అబ్బుర పరిచే త్రికూటాలయం
- శిథిలావస్థకు చేరిన కట్టడాలు.. మట్టిలో కూరుకుపోతున్న శిల్పాలు
- పాలకుల నిర్లక్ష్యంతో చరిత్రకు చెదలు

చరిత్ర

హనుమకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఆ గ్రామం కాకతీయుల సైనిక స్థావరం. పలు ఆలయాలకు, అద్భుతమైన శిల్పసంపదకు నిలయం. అంతటి చరిత్రకు పాలకుల నిర్లక్ష్యం కారణంగా చెదలు పడుతోంది. పట్టించుకునేవారు లేక అపురూప శిల్పాలు మట్టికొట్టుకుపోతున్నాయి. ప్రాచీన ఆలయాలు శిథిల మవుతున్నాయి. శాసనాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఓరుగల్లు వారసత్వ సంపదను కాపాడటంలో కేంద్ర పురావస్తు శాఖ, రాష్ట్ర పురావస్తు శాఖలు సైతం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నాయనడానికి ఈ గ్రామమే నిదర్శనంగా నిలుస్తోంది. పాలకుల నిర్లక్ష్యంతో కనుమరుగవుతున్న కొండపర్తి గ్రామం చరిత్ర భవిష్యత్ తరాలకు దూరమవుతుందన్న ఆవేదన స్థానికుల్లో కనిపిస్తోంది. వరంగల్‌కు సమీపంలో ఉన్న ప్రసిద్ధి కెక్కిన గ్రామం కొండపర్తి. అటు ఐనవోలు మండల కేంద్రం నుంచి.. వరంగల్ నగరం నుంచి 13 కి.మీ దూరంలో ఉన్న ఈ గ్రామం కాకతీయుల కాలంలో సైనిక స్థావరంగా వెలుగొందింది. నాడు సైనిక కవాతులతో దద్దరిల్లి సామంత సేనగా వర్ధిల్లింది. రుద్రదేవుడికి మంత్రిగా పని చేసిన కాటమసేనాని, ఆయన రెండవ కుమారుడు చౌండసేనాని కొండపర్తివాసులే. నాడు చౌండసేనాని కాకతీయ సైన్యానికి అధిపతిగా ఉండేవాడు. చౌండసేనాని మంచి పరిపాలనాదక్షుడు. కొండపర్తితో ఉన్న అనుబంధంతో ఈ గ్రామాన్ని సైనిక స్థావరంగా తీర్చిదిద్దాడు. అంతే కాకుండా గ్రామం పట్ల ఉన్న మమకారంతో తన పేర చౌండ సముద్రం అనే చెరువును తవ్వించాడు. ఎన్నో ఆలయాలను నిర్మించాడని ఇక్కడి శాసనాలు చెబుతున్నాయి.రెండు కొండల మధ్య ఉన్న గ్రామం కావడంతో కొండపర్తి అనే పేరు వచ్చిందని స్థానికులు చెబుతుంటారు. గణపతి దేవ చక్రవర్తి కాలంలో వేయించిన శాసనాలు ఉండగా.. చౌండసేనాని నిర్మించిన దేవాలయాలు, తటాకాలు నేటికీ కనిపిస్తాయి.


- చౌండసేనాని నిర్మించిన చౌండేశ్వరాలయాన్ని కొండపర్తి శివాలయంగా పిలుస్తారు. ఆలయంలోని శాసనం ప్రకారం ఇది క్రీ.శ 1125లో నిర్మితమైందని తెలుస్తోంది. ఆలయంలో శివలింగం,



త్రికూటాలయం

విష్ణు మూర్తి, పోలేశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించారని, ధూపదీప నైవేద్యాల కోసం చౌండ్యపురం అనే అగ్రహారాన్ని, నారుకుర్తి అనే మరో గ్రామాన్ని దానమిచ్చారని చెబుతుంటారు. చౌండసేనాని వేయించిన శాసనం, ఆంజనేయ స్వామివిగ్రహం, భైరవమూర్తి విగ్రహాలు, ఇతర శిల్పాలు ఇక్కడ చెల్లాచెదరుగా పడి కనిపిస్తాయి.

- కొండపర్తిలోని త్రికూటాలయం అద్భుత శిల్పకళ, అపూరూపమైన నిర్మాణశైలితో ఆకట్టుకుంటుంది. ప్రోలరాజు నిర్మించిన ప్రోలేశ్వరాలయం, తర్వాత రుద్రదేవుడు కట్టించిన రుద్రేశ్వరాలయాలతో కలిసి ఒక చెన్నకేశవాలయాన్ని నిర్మించారు. ఇవి మూడు కలిసి త్రికూటాలయంగా వర్ధిల్లుతోంది. ప్రస్తుతం ఇదొక్కటే కాల గతిన నిలిచిన దేవాలయం. ఈ ఆలయంలో గతంలో ఓ వినాయ కుడి విగ్రహం ఉండేది. కాలక్రమంలో అది చోరీకి గురైంది. కొండ పర్తి పెద్ద చెరువు కట్టపై ఒక పురాతన ఆలయం, కొండపర్తిలో ఉన్న మరో ఆలయం నేలమట్టమై శిథిలాలు మిగిలాయి. 500 స్తం భాలతో నిర్మితమైన ఈ దేవాలం ప్రస్తుతం



కొండపర్తిలోని బురుజు

శిథిలావస్థకు చేరు కుంది. భోగేశ్వరాయలయంగా పిలిచే ఈ గుడి ఎదుట వీరాంజనేయ స్వామి విగ్రహం నేటికీ పూజలందుకుంటోంది. అలాగే వేణుగోపాల స్వామి ఆలయం, సురాభాండేశ్వరాలయం (శివాలయం) కూడా ఉన్నాయి. వేణుగోపాల స్వామి ఆలయంలో నల్లరాతితో చెక్కిన పద్మనాభ స్వామి, గరుడ, అంజనేయ స్వామి విగ్రహం దర్శన మిస్తాయి. వాటి కింద నుంచి రహస్య సొరంగ మార్గం ఉందని చెబుతారు.

- చారిత్రక కొండపర్తిలోని సురాభాండేశ్వరాలయ ప్రవేశంలో రెండు వైపుల ద్వారా పాలక విగ్రహాలు, ఆలయంలోకి లోపలికి ప్రవేశించగానే వివిధ రకాల పరిమాణాల్లో మూడు నందులు కనిపి స్తాయి. ఇందులో రెండు కాకతీయ శైలిలో ఉండగా, మరొకటి చాళు క్య శైలిలో ఉంటుంది. అంతరాలయంలో శివలింగంపైన పైకప్పుపై సూక్ష్మరాతి విగ్రహాలు చెక్కి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఆ విగ్రహాల్లో ఒక యుద్ధ వీరుని విగ్రహం కనిపిస్తుందని, అది చౌండ సేనానిదని చెబుతారు. గ్రామంలో మూడు రాతి శాసనాలు ఉండగా ఊరి చివరన చెరువుగట్టు పక్కన ఉన్న గుట్టమీద కొక్కెర గుండు అని పిలిచే రాతి బండపై ఒక శాసనం ఉంది. దానిపై క్రీశ 9వ శతాబ్దం నాటి ప్రాచీన తెలుగు లిపి ఉంది. మూడో శాసనం క్రీశ 1242లో అందుకు ముందు నిర్మితమైన పోలేశ్వర ఆలయంలో రుద్రే శ్వర, కేశవమూర్తులను ప్రతిష్ఠాపన చేసిన ఆలయానికి ప్రాకారం ఏర్పరచినట్లు రాసి ఉంది.

నేడు దీనావస్థలో...

కొండపర్తిలోని కాకతీయుల నాటి ప్రాచీన ఆలయాలు, కట్టడాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. నాటి సైనిక స్థావర ఆనవాళ్లు చౌండసేనాని నిర్మించిన ఆలయాలు కనుమరగవుతున్నాయి. చౌండేశ్వరాలయం ఈ ఆలయం పూర్తిగా శిథిలమైంది. ఆలనా పాలనా లేకపోకవడంతో ఆలయం చుట్టూర చెట్లు, ముళ్లపొదలు దట్టగా పెరిగి అక్కడి వెళ్లడానికి కూడా వీలు లేకుండా ఉంది. ఆ పక్కనే రెండు నంది విగ్రహాలు మట్టిలో కూరుకుపోయి ఉన్నాయి. పట్టించుకునేవారు లేక త్రికూటాలయం క్రమంగా ధ్వంసమ వుతోంది. ఈ ఆలయాన్ని పునరుద్ధరించేందుకు కేంద్ర పురావస్తు శాఖ స్తంభాలపై నెంబర్లు వేసింది కానీ ఆ తర్వాత పట్టించుకోలేదు. కాకతీయుల నాటి శిల్పాలు భూమిలో కూరుకుపోతున్నాయి. శాసనాలు దెబ్బతింటున్నాయి. చుట్టూదట్టమైన చెట్లు, ముళ్లపొదలు పెరగడంతో ఆలయాలలోపలికి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామస్థులు రాతి స్తంభాల వద్ద పశువులను కట్టేస్తున్నారు. ఆలయ శిథిలాలు మందు బాబులకు అడ్డాగా మారాయి.

కల్యాణం.. కమనీయం..

- అంగరంగ వైభవంగా సీతారాముల పరిణయం
- భక్తజనంతో ఉప్పొంగిన జీడికల్ వీరాచల క్షేత్రం
- పట్టు వస్త్రాలు అందజేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య



తాళిబొట్టును చూపుతున్న అర్చకుడు, చిత్రంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భక్తులు

లింగాలఘణపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా జీడికల్ వీరాచల శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు భక్తులు పోటెత్తడంతో జీడికల్ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి చిందం వంశీ బ్రహ్మోత్సవ వేడుకల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లను చేపట్టగా కల్యాణ మహోత్సవానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టువస్త్రాలను, హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు పెసరు సుజాతమ్మ ముత్యాల తలంబ్రాలను అందజేశారు. సుమారు రెండున్నర గంటల పాటు వేదపండితులు 31 మంది జంటలతో ఈ కల్యాణ తంతును నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీతో పాటు అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీపీవో స్వరూప, ఆర్డీవో గోపీరామ్ కల్యాణ క్రతువులో పాల్గొన్నారు. ఇక వేడుకకు తరలొచ్చిన భక్తులు వీరాచలాద్రిపై ఉన్న జీడి గుండం పాలగుండాల్లో భక్తులు పుణ్యస్నానా లు ఆచరించి స్వామి వారి దర్శనం చేసుకు న్నారు. లేడిబండ వద్ద నీటి ఊటలను, మాయ లేడి రూపంలో ఉన్న మారీచుడి పాదాలను దర్శించుకున్నారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తుల కోసం లింగాలఘణపురం మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమా న్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నదాన వితరణ చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ ఆధ్వర్యంలో జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, నర్మెట సీఐ అబ్బయ్య, లింగాలఘణపురం, రఘునాథపల్లి, దేవరుప్పుల, పాలకుర్తి ఎస్సైలు బండి శ్రవణ్‌కుమార్, నరేశ్, సృజన్‌కుమార్, యాకూబ్ హుస్సేన్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూల ద్వారా సర్వదర్శనానికి అనుమతిం చారు. ఆలయ ధర్మ కర్తల మండలి చైర్మన్ మూర్తి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుడి వంశీధర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్, పాలకుర్తి ఆలయ కార్యనిర్వహ ణాధికారి లక్ష్మీప్రసన్న, ఉప్పలమ్మ దేవస్థానం ఈవో కెకె రాములు, రాజేంద ర్ రెడ్డి, మోహన్, భరత్‌కుమార్, మల్లేశం, ధర్మకర్తలు మోటికె శ్రీశైలం, నర్ర శరభారెడ్డి, ఊడ్గుల వెంకన్న, కత్తుల శ్రీనివాస్‌రెడ్డి, మంద శ్రీధర్‌రెడ్డి, కడకంచి లక్ష్మి, పసునూరి ఉపేందర్, తుపాకుల వెంకటేశ్, అబ్బటి బచ్చిరెడ్డి తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తా : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సుప్రసిద్ధ జీడికల్ ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం బ్రహ్మోత్సవాలకు హాజరైన మాట్లాడారు. ఆలయాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా జీడికల్‌కు రావాల్సిన రోడ్లను కూడా అభివృద్ధి చేస్తానని, భక్తులకు వసతి సత్రాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ వీరాచాల క్షేత్రం పైనున్న జీడి, పాల గుండాలకు భక్తులు వెళ్లేందుకు ఏడాదిలోపు మెట్ల నిర్మాణం చేయిస్తామన్నారు.



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బన్న అయిలయ్య

నిత్య చైతన్యశీలి కాళోజీ

- ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి
- కళాక్షేత్రంలో ఘనంగా తొలి కవి సమ్మేళనం

హనుమకొండ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నిత్య చైతన్య శీలి అని, ఆయన సాహిత్యం నిత్య నూతన చైతన్యమని కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి అన్నారు. కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రభుత్వం జాతికి అంకితం చేసిన సందర్భంగా బుధవారం కాళోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలి కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు వీఆర్ విద్యార్థి మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా వరంగల్ కవిలోకం ఎదురుచూస్తున్న కాళోజీ కళాక్షేత్రాన్ని ఎట్టకేలకు ప్రభుత్వం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, కాళోజీ ఫౌండేషన్ పక్షాన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కాళోజీ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 'పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది' అంటూ జీవితమంతా సమాజానికి అంకితం చేసిన మహావ్యక్తి కాళోజీ అని శ్లాఘించారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ వరంగల్ కవులు ఎదురుచూస్తున్న కల నెరవేరిందని, కవులు, రచయితలు, కళాకారులు వరంగల్‌ను గొప్ప సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ కవి బిల్ల మహేందర్ ఆహ్వానంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఆచార్య బన్న అయిలయ్య, అనిశెట్టి రజిత, మహ్మద్ సిరాజొద్దీన్ సీతాల రఘువేందర్, డీపీఆర్‌వో భానుప్రకాశ్ తదితరులు హాజరయ్యారు. కవి సమ్మేళనంలో కవులు నెల్లుట్ల రమాదేవి, అంజనీదేవి, దేవులపల్లి వాణి, మాదారపు వాణిశ్రీ, అన్వర్, తాడిచర్ల రవి, కుమార్, పల్లేరు వీరస్వామి, కార్తీక రాజు, జితేందర్, మహ్మద్ గుల్షన్, ఉమ, రమాదేవి, వందన, రాజమోహన్, వకుల వాసు, హాజీనురాని, శంకర్ నారాయణ, అనిత, విద్యాదేవి, పెద్ది వెంకటయ్య, మస్న వెంకటేశ్వర్లు, వి.రవికుమార్, రామా రత్నమాల తదితర 60మందికి పైగా కవులు కవితా గానం చేశారు. కవిలోకం ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న కాళోజీ కళాక్షేంద్రంలో కవి సమ్మేళనంలో పాల్గొనడం మధురానుభూతిని కలిగించిందని కవులు హర్షం వ్యక్తం చేశారు.

కవులకు దక్కిన గౌరవం

నెల్లుట్ల రమాదేవి, కవయిత్రి



కళలకు కాణాచి, ఉద్యమాల పురిటి గడ్డ మన ఓరుగల్లు. రాష్ట్రంలో ఎక్కడా లేనంత అద్భుతమైన వేదిక ఏర్పడడం, అది కూడా మన ధిక్కార స్వరాన్ని, పోరాటా స్వభావాన్నీ వారసత్వంగా ఇచ్చిన కాళోజీ పేరిట నిర్మించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇది కవులందరికి దక్కిన గౌరవం.

అద్భుత దర్శనీయ స్థలం.. కళాక్షేత్రం

అన్వర్, కవి



కాళోజీ స్ఫూర్తి ప్రదాత. వరంగల్ చరిత్రలో కాళోజీ కళాక్షేత్రం అద్భుతమైన దర్శనీయ కట్టడం. కాళోజీ గౌరవానికి ఏ మాత్రం తగ్గకుండా అంతే గొప్పగా సాంకేతిక పరిజ్ఞానంతో కట్టారు. తెలుగు రాష్ట్రాల్లో ఇంత గొప్ప కళాక్షేత్రం లేదన్నది వాస్తవం. కాళోజీ పౌరుషానికి తగ్గట్టుగా ఉందీ భవనం. కళాక్షేత్రం ఎదుట కాళోజీ విగ్రహం జీవకళతో ఉట్టిపడుతోంది. ప్రభుత్వం, నాయకులు, అధికారులు, కాళోజీ ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు. ఇన్నేళ్ల నిరీక్షణ ఫలించింది.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం కృషి

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే మోదీ లక్ష్యం • కేంద్ర సహాయ మంత్రి నిముబెన్ జయంతి బాయి బంబానియా

గణపురం / భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకు గాను 'ఆకాంక్షాత్మక' జాబితాలోని జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామని కేంద్ర వినియోగదారుల, ఆహారం, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ కార్యదర్శి నిముబెన్ జయంతి బాయి బంబానియా తెలిపారు. ఆకాంక్షాత్మక జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం భూపాలపల్లి జిల్లాకు వచ్చిన ఆమె గణపురం మండలంలోని చెల్పూరులో పర్యటించి మిల్లెట్ హౌస్ యూనిట్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా మల్టీగ్రేన్ జావ, రాగి లడ్డూలను తిని చాలా బాగున్నాయని అభినందించారు. వైద్య, డీఆర్డీఏ, మత్స్య, వ్యవసాయ, ఉద్యాన, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించి.. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన సభలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 112 జిల్లాలను అభివృద్ధి చెందనివిగా ఆకాంక్షాత్మక జాబితాలో కేంద్రం గుర్తించిందని, అందులో భూపాలపల్లి కూడా ఉందన్నారు. ఈ జిల్లాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నీతిఆయోగ్ ఆకాంక్షాత్మక జిల్లాలుగా ఏర్పాటు చేసిందన్నారు. 'సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్' నినాదంతో కేంద్రం ముందుకెళుతోందని, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం పురోగతి సాధిస్తోందన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ను ఐదో స్థానంలో నిలిపిన ఘనత ప్రధాని మోదీదని, మున్ముందు మూడో స్థానంలోకి తీసుకురావాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ యాస్పిరేషన్ లక్ష్యాల సాధనలో ముందంజలో ఉన్న నేపథ్యంలో భూపాలపల్లి జిల్లాకు రూ. 10 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మిల్లెట్ యూనిట్ నుంచి తయారు చేసిన ఆహార పదార్థాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంగా అందించడానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న నిముబెన్ జయంతి బాయి బంబానియా

అదనపు కార్యదర్శి ఖుష్బూ, భూపాలపల్లి అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అభివృద్ధి లక్ష్యాలపై సమావేశం

గణపురం మండలం చెల్పూరు నుంచి భూపాలపల్లి కలెక్టరేట్‌కు చేరుకున్న కేంద్ర సహాయమంత్రి నిముబెన్ జయంతి బాయ్ బంబానియా వెనుకబడిన జిల్లాల అభివృద్ధి లక్ష్యాలు సాధనపై విద్యావైద్య, వ్యవసాయ, ఉద్యాన, సంక్షేమ, డిఆర్డీఓ శాఖల అధికారులతో కేంద్రమంత్రి సమావేశం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కలికట్టుగా కృషి చేయాలన్నారు.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధిలో జిల్లా ప్రదర్శనను కేంద్రమంత్రి అభినందించారు. సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సీపీవో బాబురావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ప్రపంచంలో ఎక్కడా లేనివి తెలంగాణలో ఉన్నాయి
- వీక్షకులను ఒలలాడిస్తున్న లక్నవరం సరస్సు
- మౌళిక వసతులకు పెద్దపీట
- మూడో ఐలాండ్ ప్రారంభంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

గోవిందరావుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామ సమీపంలో ఉన్న లక్నవరం సరస్సులో రూ.7కోట్ల వ్యయంతో మూడెకరాల విస్తీర్ణంలో టీజీటీడీసీ, ఫ్రీకోట్స్ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన మూడో ద్వీపాన్ని ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ పర్యాటక శాఖ కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ములుగు జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. సహజసిద్ధమైన అందాలతో లక్నవరం సరస్సు వీక్ష కులను అలరిస్తోందని, రామప్ప, లక్నవరం లాంటి సరస్సులు ఉండటంతో పాటు దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్క-సారలమ్మ జాతర ములుగు జిల్లాకు గుర్తింపు తెచ్చిపెడుతోందన్నారు. పర్యాటకుల అవస రాలను దృష్టిలో పెట్టుకుని మౌళిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని, లక్నవరం సరస్సులోని ద్వీపాల అనుభూతి పొందేందుకు అండమాన్, మాల్దీవులు లాంటి సుదూర ప్రదేశాలకు వెళ్లాల్సిన అవసరం కూడా లేకుండా తెలంగాణలో ఇలాంటి ఓ అందమైన టూరిజం స్పాట్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. సరస్సులోని రెండు ద్వీపాల్లో ఇప్పటికే కాటేజీల నిర్మాణం పూర్తయిందని, మూడో ద్వీపంలో కాటేజీల నిర్మాణాన్ని కూడా పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను బలోపేతం చేయడానికి రూ.250 కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినట్టు తెలిపారు.

మంత్రి ధనసరి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు కేటాయిస్తున్నారన్నారు.



లక్నవరం సరస్సులోని మూడో ద్వీపంలో కాటేజీలను ప్రారంభిస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి సీతక్క, ఎంపీ బలరాంనాయక్

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ రూ.100కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పర్యాటక ప్రాంతాల్లో ఎవరూ ప్లాస్టి క్ కవర్లు వాడొద్దని ఆమె కోరారు.

పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల గత ప్రభుత్వ పాలనలో పర్యాటక ప్రాంతాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని, పీపీపీ తరహాలో పర్యాటక ప్రాంతాలను తీర్చిదిద్దు తామన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో పర్యాటక ప్రాంతా లకు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పర్యాటక అభివృద్ధిసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోతన ఊరిలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం

పాలకుర్తిలో మంత్రి జూపల్లి

పాలకుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన, బసవ పురాణం గ్రంథకర్త పాల్కురికి సోమనాథుడి స్మారక స్మృతి వనాల అభివృద్ధి పనులు ఏడాది కాలంగా నిలిచిపోయాయని, వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన మామిడాల యశస్వినిరెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో కలిసి బమ్మెర గ్రామంలోని పోతన స్మారక స్మృతివనాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అభివృద్ధి పనులను పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థులు పోతన పద్యాలు నేర్చుకోవాలని సూచించారు. అమెరికాలో తెలుగు వారు వారి పిల్లలకు యాప్ ద్వారా పద్యాలను వినిపిస్తున్నారని, పోతన పద్యాలు ఎల్లలు దాటితే.. మన ప్రాంతం వారు మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది నుంచి అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, తిరిగి పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. చెక్ డ్యాం నిర్మాణానికి రైతులతో మాట్లాడి భూమిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాసర తరహాలో అక్షరాభ్యాసం చేసేలా నిర్మాణాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. పాలకుర్తి, బమ్మెర, వల్మిడి గ్రామాలు మరింత అభివృద్ధి చెందేలా, టూరిస్టు సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేలా నిధుల మంజూరుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పోతన స్మారకం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసి ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు. పోతన స్మారక విగ్రహం, లక్ష్మీ విగ్రహం కోసం మరిన్ని నిధులిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రిటైర్డు ఐఏఎస్ పాపారావు, రిటైర్డు ప్రొఫెసర్ పాండురంగారావు, డీపీవో స్వరూప, ఈఈ ప్రవీన్, డీఈ శ్రీకాంత్, విద్యుత్ శాఖ ఎస్ఈ వేణుమాధవ్, డీఈ రాంబాబు, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ డీఈ రాజేందర్, క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, యుగేంధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



బమ్మెరలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కేసులే

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల

గంగారం, నవంబరు 20 : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ నిర్మల ఎరువుల వ్యాపారులను హెచ్చరించారు. బుధవారం గంగారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. డీలర్ల బిల్లు బుక్స్‌లను పరిశీలించారు. లైసెన్సులు పొందిన ప్రతీ డీలరు ధరల పట్టికను ప్రదర్శించాలని కోరారు. విత్తన డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఊరుకోమన్నారు. అనంతరం పెద్దెల్లాపురంలో పొద్దుతిరుగుడు, మిర్చి తోటలను పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ప్రతీ రైతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి లాభాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టీకల్చర్ అధికారి మరియన్న, ఏవో రాంబాబు, ఏఈవోలు కిషోర్‌కుమార్, సింధూ పాల్గొన్నారు.



కోమట్లగూడెంలో ఎరువుల గోదాంను తనిఖీ చేస్తున్న విజయ నిర్మల

‘ప్రతీ కుటుంబం ఆర్థికంగా ఎదగాలి’

మరిపెడ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ కుటుంబం ఆర్థికంగా ఎదగాలని ప్రగతి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల జాన్ అన్నారు. బుధవారం అబ్బాయిపాలెంలో ఆర్థిక అక్షరాస్యతపై రైతులు, మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతి సేవా సమితి 1995లో 30 మంది మహిళా సభ్యులతో పొదుపు సంఘాలుగా ఎర్పడిందని, ఆ తర్వాత అంచలంచెలుగా ఎదిగి 30 కోఆపరేటీవ్ సంఘాల సొసైటీలతో సంఘం బలపడిందన్నారు. ప్రగతి సేవా సమితి మరిపెడ, నర్సింహులపేట, నెల్లికుదురు, చిన్నగూడూరు కో-ఆర్డినేటర్లు ఐనాల పరుశురాములు, వెంకన్న, వంశీ, జిన్నా లచ్చన్న, సీత వీరభద్రం, బందు పరుశురాములు, మహేశ్వరి, మామిడాల వెంకన్న, చైతన్య, కరుణాకర్, పెద్దబోయిన కుమారస్వామి, మల్లెపంగు విజయ్, సుమలత, వెంకన్న, మహిళలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రగతి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్

మానుకోటను రోల్ మోడల్‌గా నిలుపుతాం

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దినదినభివృద్ధి చెందిన జిల్లా కేంద్రంగా ఎదిగినమానుకోట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో రోల్‌మోడల్‌గా నిలుపుతామని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 29వ వార్డు పరిధిలో రూ.10లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. అదే విధంగా ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య, కౌన్సిలర్లు పోతు రాజు రాజు, నిమ్మల శ్రీనివాస్, ఖలీల్‌పాషా, విజయలక్ష్మి, శ్రీనివాస్, సునిత, శిరీష, చిన్న, మధు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మురళీనాయక్

న్యూస్ బాక్స్

సంక్షేమ పథకాలపై ప్రజాపాలన కళాయాత్ర

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన కళాయాత్ర సమాచార, జిల్లా పౌరసంబంధాల అధికారి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. జిల్లాలోని మహబూబాబాద్ మండలం రెడ్యాల, కంబాలపల్లి, కురవి మండలం తిరుమలాపురం, మోదుగుల గూడెం, తొర్రూరు మండలం అన్నారం, చింతలపల్లి, అమ్మాపురం గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీలపై ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్లు గిద్దె రాంనర్సయ్య, బండ వెంకన్న, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కేటీఆర్ గో బ్యాక్ అంటూ ఫ్లెక్సీతో నిరసన



అంబేద్కర్ సెంటర్‌లో కేటీఆర్ గో బ్యాక్ అంటూ ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న హనుమంతుడి గడ్డ భూబాధితులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో హనుమంతుని గడ్డ భూ బాధితులు పుచ్చకాయల మధు ఆధ్వర్యంలో బుధవారం కేటీఆర్ గో బ్యాక్ అంటూ ఫ్లెక్సీని ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో విధ్వంస పాలన కొనసాగిందని ఆరోపించారు. మానుకోట మునిసిపల్ భవన నిర్మాణానికి దళితుల భూమిని లాక్కున్నారని చెప్పారు. అభివృద్ధి పేరిట దళితుల అసైన్డ్ భూములను దౌర్జన్యంగా లాక్కోవడానికి నిరసనగా కేటీఆర్‌కు గోబ్యాగ్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల ఉపేందర్, మనోహర్, శ్రీనివాస్, కిరణ్, సన్నీ పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరం

కేసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అర్పనపల్లిలో బుధవారం పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడిపశువుల్లో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. కేసముద్రం, ఇనుగుర్తి పశువైద్యాధికారులు విజయ్‌కుమార్, రవీందర్‌లు 136 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు కృత్రిమగర్భధారణలో కేవలం ఆడదూడలు జన్మించే విధంగా 'లింగ నిర్ధారణతో విభజించిన వీర్యం' అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ కె.రఘువీర్, ఎస్.సుధాకర్, ఎస్‌కె.సుభాని పాల్గొన్నారు.

‘క్వింటా వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలి’



గూడూరులో ధాన్యం పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సన్నరకం వరి ధాన్యం క్వింటాపై రూ.500 చొప్పున బోనస్ అందిస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్, మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్, కిసాన్‌మండల అధ్యక్షుడు వడ్లకొండ యాకయ్య డిమాండ్ చేశారు. గూడూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన అన్నిరకాల సన్న ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.2320తో పాటు రూ.500 ఒకేసారి రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చెల్పూరి శ్రీశైలం, రాచమల్ల వెంకన్న, పడాల నాగరాజు, బత్తుల లక్ష్మణ్, అరవింద్,శ్రీధర్,సంపత్, అనిల్, రాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

● అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని , విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ కనపర్చాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో అన్నారు. మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఇందులో 350 మంది బాల బాలికలు పాల్గొన్నారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి జ్యోతి, గ్రౌండ్ వాటర్ అధికారి వేముల సురేష్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న లెనిన్‌వత్సల్ టొప్పో

కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్



సీఐటీయూలో చేరిన వారితో సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రవాణారంగ కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ప్రైవేటు, అండ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టురంగ ట్రాలీ కార్మికులు 30 మంది సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది కార్మికులు రవాణారంగం మీద ఆదారపడి స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. వీరిలో ఎక్కువ మంది చదువుకున్న యువకులు ఉద్యోగఅవకాశాలు లేకపోవడంతో ప్రైవేటు ఫైనాన్స్ లోన్లు తీసుకొని ఈ రంగంలోకి వస్తున్నారని పేర్కొన్నారు. దీంతో కార్మికులపైన ఆర్థికభారం పడుతుందన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రైవేటు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. నాయకులు సూర్నపు సోమయ్య, రాజమౌళి, సీతారాంనాయక్, ఆకుల రాజు, రావుల రాజు, అల్లి శ్రీనివాస్ రెడ్డి, కుమ్మరికుంట్ల నాగన్న, హేమానాయక్, ఎమ్డీ ఉస్మాన్, మచ్చ వెంకన్న, బిక్షపతి, ఐలయ్య, దుర్గేష్, ఎల్లయ్య, జాన్బియా, విజయ్, శ్రీశైలం, ఉపేందర్, హుస్సేన్, నాగరాజు, మహేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

‘చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లను సక్సెస్ చేయాలి’

తొర్రూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ =ను విజయవంతం చేయాలని ఆ సంఘం తొర్రూరు మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ అన్నారు. బుధవారం తొర్రూరులో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 7నుంచి పాఠశాలల్లో 8, 9, 10 తరగతులకు టెస్టులు నిర్వహించామని, వాటిల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నేడు 21 తేదీ గురువారం తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి పరీక్షలు నిర్వహిస్తామని, ఎంపికైన విద్యార్థులు మండలస్థాయి పరీక్షల్లో పాల్గొనాలన్నారు. ఇక్కడ ఎంపికైన వారికి జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో పరీక్షలు ఉంటాయని, ప్రతిభ కనబర్చిన వారందరికి పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తారన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయిపెల్లి యాకయ్య, కొండం వసుందర్, తండ ప్రభాకర్, చంద్రమౌళి, ముత్తిలింగం, రమేష్, కుమార్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాళ్లపల్లి రమేష్

గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం

(5వ పేజీ తరువాయి)

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత మాట్లాడుతూ గిరిజన రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ నిలుస్తోందని చెప్పారు. అరెస్టు చేసిన గిరిజన రైతులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. తన కుటుంబ సభ్యుల ఫార్మా కంపెనీల కోసం గిరిజన రైతులను భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తహసీల్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించే ప్రాం తాన్ని సందర్శించారు. సమావేశంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, బానోత్ రవికుమార్, జేరిపోతుల వెంకన్న, కన్నాయాళ్ల మురళీధర్‌రెడ్డి, మహబూబ్‌పాష, ముత్యం వెంకన్న పాల్గొన్నారు.

దేశ ప్రజలకు అండగా నిలబడ్డ సీపీఐ

● జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



సీపీఐ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి విజయసారథి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వంద సంవత్సరాలుగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రజల పక్షాన నిలబడిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మహబూబాబాద్ ధర్మన్న కాలనీలో 25 వార్డు మునిసిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని తోట రాజకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసారధి మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలైందని జిల్లాలో శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని తెలిపారు. 2025లో జరిగే మునిసిపల్ ఎన్నికల్లో సీపీఐని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగుకుమార్,చింతకుంట్ల వెంకన్న, మంద శంకర్, తండా శ్రీనాథ్, మాలోతు రవీందర్, రాకేష్, అలీమా, మాధవి, వెంకటేష్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను సన్మానించిన వీఈడబ్ల్యూఏ బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వీరబ్రహ్మాచారిని జిల్లా విశ్వకర్మ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో బుధవారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దొంతోజు ఓంకార్ నేతృత్వంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు ఉల్లి విద్యాసాగర్, తేలుకుంట్ల ఉపేంద్రాచారి, ఎర్రోజు లక్ష్మణాచారి, రత్నమాచారి, సోమేశ్వర్, వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దంతాలపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నేడు మండల కేంద్రంతో పాటు పెద్దముప్పారం 33/11కేవీ పరిధిలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ పెద్దనాగారం మెయిన్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో భాగంగా ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు త్రీఫేజ్ సరఫరా ఉండదన్నారు. సింగిల్ ఫేజ్ సరఫరా ఉంటుందన్నారు. మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నిరుపేదలకు భరోసా సీఎంఆర్ఎఫ్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

చిన్నగూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసా ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన మాలోతు శాంత, ఎడ్ల నాగరాజు. బాలు, చిన్నగూడూరుకు చెందిన భానుప్రకాష్, షేక్ మొఘలాన్‌బీలకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. మండల నాయకులు సుధగాని నాగేష్, డీఎస్ వెంకట్య, మాజీ సర్పంచ్ మంజుల, బర్లపురం యాకన్న, వీరాచారి, బాలు, శంకర్ పాల్గొన్నారు,

సూరయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం

ఇనుగుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన శ్రీలక్ష్మినర్సింహస్వామి కారు యూనియన్ అధ్యక్షుడైన ఒరుగంటి సూరయ్య ఇటీవలె గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి బుధవారం సంఘం తరఫున రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శోభన్, కోశాధికారి ఎండీ.రహీం, బండి సంతు, చంద్ర, శ్రీను, రమేష్‌రెడ్డి, హరిచంద్, నాగరాజు, పవన్, చింటూ, కార్తీక్, నబి, రాము, అశోక్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ కవిత పరామర్శ..

సూరయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత పరామర్శించారు. ఆమె వెంట మహబూబ్‌పాషా, సొసైటీ చైర్మన్ దీకొండ వెంకన్న, బొబ్బిలి మహేందర్‌రెడ్డి, గండు నాగన్న, మలిశెట్టి రవి, శోభన్, గుండ్రపల్లి దేవేందర్, వేముల శ్రీనివాస్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మరిపెడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాన్ని బుధవారం మునిసిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ సింధూరకుమారి పరామర్శించారు. మరిపెడ పట్టణానికి చెందిన మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు ఎస్కే.ఖైరున్‌బీ మామ ఖాసీంసాబ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసి సింధూరకుమారి ఖైరున్‌బీ ఇంటికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. చైర్‌పర్సన్ వెంట బీఆర్ఎస్ నాయకులు గణేశ్, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

‘పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి’

గార్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రతీ ఒక్కరు మరుగుదొడ్లను నిర్మించుకొని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి అజ్మీరా కిషన్ నాయక్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్లు లేకపోవడంతో పరిసరాలు కలుషితమై ప్రజలు అంటురోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం శీలంశెట్టి వెంకటేశ్వర్లు, సిబ్బంది కిశోర్, దాసు, శ్రీను పాల్గొన్నారు.



గార్ల మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇంటర్వ్యూ

గాయపడిన మహిళ మృతి

డోర్నకల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి వెన్నారంలో చోటు చేసుకుంది. పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం. వెన్నారం గ్రామానికి చెందిన పసుపులేటి అనూష (24) సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం చెన్నకేశవపురంకు చెందిన పసుపులేటి వీరబాబుతో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో భార్యాభర్తల మధ్య తరుచు వివాదాలు చోటు చేసుకునేవి. నాలుగు నెలల క్రితం మరోమారు భర్తతో ఘర్షణ చోటు చేసుకోవడంతో అనూష పుట్టింటికి వచ్చింది. పంచాయతీ నిర్వహించి భార్యాభర్తల మధ్య సయోధ్య కుదుర్చారు. దీంతో వీరబాబు వెన్నారంలో ఉంటూ ఏదైనా కూలీ పనులు చేసుకుంటున్న కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండడంతో మనస్తాపం చెందిన అనూష ఈనెల 14న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలకల మందు పెస్టను తాగింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబసభ్యులు అనూషను చికిత్సనిమిత్తం ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి అనూష మృతి చెందారు. మృతురాలికి భర్త వీరబాబు, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతురాలు అనూష సోదరుడు నర్సంశెట్టి సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

సీరోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఈనెల 15న భూతగాదాలో గంగారపు సుధాకర్ అనే వ్యక్తిని ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్యాయత్నానికి పాల్పడిన పత్తి అంతయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నగేష్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మన్నెగూడెం వెళ్లే దారిలో సీరోలుకు చెందిన గంగారపు సుధాకర్‌కు 3 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అదే దారిలో పత్తి అంతయ్యకు కూడా వ్యవసాయ భూమి ఉంది. అంతయ్య భూమిలో నుంచి సుధాకర్ తన వ్యవసాయ భూమిలోకి గత కొన్ని సంవత్సరాలుగా వెళ్తున్నాడని, ఈ క్రమంలో గత సంవత్సరం నుంచి ఇద్దరి మధ్య దారి విషయంలో ఘర్షణ చోటుచేసుకుంది. సుధాకర్ ఈనెల 15న వ్యవసాయ భూమి నుంచి ఇంటికి బైక్‌పై వస్తుండగా సీరోలు నుంచి అంతయ్య ట్రాక్టర్‌పై వ్యవసాయ భూమికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అంతయ్య నేరుగా వెళ్లి సుధాకర్ బైక్‌ను ట్రాక్టర్‌తో ఢీ కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. సుధాకర్ తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అంతయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్‌రైలు

● కృష్ణ, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యం

డోర్నకల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మీదుగా విజయవాడ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో బుధవారం పాపటపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో నిలిచిపోయింది. గూడ్స్ రైలు వెనుకాలే వెళ్తున్న ఆదిలాబాద్ నుంచి తిరుపతి వెళ్లే కృష్ణ ఎక్స్‌ప్రెస్‌ను పాపటపల్లి ఔటర్‌సిగ్నల్ వద్ద నిలిపివేశారు. గూడ్స్ రైలుకు మరో ఇంజన్‌ను అమర్చి అనంతరం పాపటపల్లి రైల్వేస్టేషన్‌కు తరలించారు. దీంతో కృష్ణ ఎక్స్‌ప్రెస్ 1.20 గంటల పాటు డోర్నకల్-పాపటపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య నిలిచింది. అదే సమయంలో డోర్నకల్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ డోర్నకల్‌లో 30 నిమిషాల పాటు నిలిపివేశారు.

‘వరి కొయ్యలను రైతులు కాల్చొద్దు’

దంతాలపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరి కొయ్యలను రైతులు కాల్చొద్దని వ్యవసాయాధికారి వాహిని అన్నారు. బుధవారం ఆమె రేపోణి, కుమ్మరికుంట్ల, తదితర గ్రామాల్లో వరి కొయ్యల కాలబెట్టడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కొయ్యలను కాలబెట్టడం ద్వారా సారవంతమైన నేల నిస్సారవంతమవుతుందన్నారు. భూమిలో సహజ సిద్ధంగా ఉండే నత్రజని భాస్వరం వంటి విలువైన పోషకాలు కోల్పోతామన్నారు. ఏఈవోలు దీక్షిత్, ఉదయ్, శిరిష పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

తొర్రూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో మహంకాళి బుచ్చయ్య అన్నారు. బుధవారం వెలికట్టె, పెద్దమంగ్య తండా, హరిజన కాలనీ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థుల ప్రతిభను పరీక్షించి ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంచి నాణ్యమైన విద్యను బోధించాలని, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. వారి సామర్థ్యాలను బట్టి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఇండియన్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న దుర్గా భవాని

తొర్రూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి అందించే ఇండియన్ ఎక్సలెన్స్ అవార్డును సోమారంకి చెందిన పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ కుమార్తె దుర్గా భవాని అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవాల్లో సినీహీరోయిన్ అమ్రితారావు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సంస్థలు, వ్యక్తులకు ప్రధానం చేసే ప్రతిష్టాత్మక అవార్డు అని, వారి కృషిని గుర్తించి ప్రదానం చేస్తారని తెలిపారు.

● మరిపెడ : మరిపెడ ఎస్సీ బాలికల గురుకుల విద్యార్థిని గుగులోత్ అంజలికి భద్రాద్రి జోన్ 10వ స్పోర్ట్స్ మీట్‌లో ఓవరాల్ చాంపియన్ షిప్ దక్కింది. ఇటీవల రాయపర్తి సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో భద్రాద్రి జోన్ 10వ స్పోర్ట్స్ మీట్ జరుగగా మరిపెడ ఎస్సీ గురుకుల విద్యార్థినులు ప్రతిభ చాటారు. అంజలి 7 రకాల ఈవెంట్స్‌లో సత్తాచాటి ఓవరాల్ చాంపియన్ షిప్ దక్కిం చుకోగా, ఆర్.చందన, జి.శ్రీవాణి, బి.దివ్య వివిధ ఈవెంట్స్‌లో పతకాలు సాధించారు. బుధవారం స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ, పీఈటీలు భవాని, సంతు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు వారికి అభినందనలు తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

కురవి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఎస్ఆర్. రంగనాథన్ గ్రంథాలయ చైర్మన్ షేక్.జానీ ఆధ్వర్యంలో ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాన్ని నిర్వహించారు. 30 మందికి ఆపరేషన్ చేయించేందుకు సిఫారసు చేశారు. అనంతరం వ్యాస రచనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొం దిన జి.శ్యామల, శ్రీనిత, విద్యానంద్‌లకు ఎంఈవో బాలాజీ బహుమతులు అందజేశారు. డాక్టర్ మధుసూదన్, జక్కుల మల్లయ్య, యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దు

దంతాలపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దని తహసీల్దార్ రాజేశ్వర్ అన్నారు. బుధవారం ఆయన దంతాలపల్లితో పాటు గున్నేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంను ఆకస్మికంగా పరిశీలిలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. కొనుగోలు కేంద్రంకు తీసుకోరావాలన్నారు. ప్రభుత్వం సన్నధాన్యానికి రూ.500లు బోనస్ ఇస్తుందన్నారు. గిర్దావర్ నజీముద్దిన్, ఏఈవో శిరిష, సీఈవో వెంకన్న తదితరులు పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లికుదురు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ తెలిపారు. ఆలేరు, శ్రీరామగిరి, మధతుర్తి, రావిరాల, ఎర్రబెల్లిగూడెం, మేచరాజుపల్లి గ్రామాలలో పీఏసీఎస్, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , దళారులకు ధాన్యం విక్రయించకూడదన్నారు. దళారులకు మోసపోకుండా ఉండటానికే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు గిట్టుబాటు ధరతోపాటు రూ.500 బోనస్ లభిస్తుందన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలన్నారు. బ్యాంక్ ఎకౌంట్ లో ధాన్యం డబ్బులు జమచేస్తారని తెలిపారు. డిసెంబర్‌లో రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎస్‌కె యాస్మీన్ పీఏసీఎస్ చైర్మన్‌లు గుండా వెంకన్న, దేవేందర్‌రావు, బోజ్యానాయక్, గొల్లపెల్లి ప్రభాకర్‌గౌడ్, ఎదళ్ల యాదవరెడ్డి,నాయిని సత్యపాల్‌రెడ్డి, బాలాజీనాయక్, వలబోజువెంకటేశ్వర్లు, కొప్పు శ్రీను, పట్నంశెట్టి నాగరాజు. రాజుయాదవ్ జిలుకర యాలాద్రి, మార్కెట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.